ఈనాడు
జనగామ
శుక్రవారం అక్టోబరు 25, 2024

చలికి గజగజ.. సౌకర్యాలు వెలవెల!

పరిశీలన

బడుగు, బలహీన పేద వర్గాలకు విద్యావకాశాలు కల్పించే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రోజురోజుకూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుండటంతో చలితీవ్రత పెరుగుతుంది. చలిలో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గదులకు తలుపులు, కిటికీలకు రెక్కలు లేక సాధారణ చలికే వణికిపోతున్నారు. దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితోనే ఉపశమనం పొందుతున్నారు. పడక మంచాలు సరిగా లేక, నేలపైనే పడుకుంటున్నారు. దోమల మోత, అరకొర వసతుల నడుమ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై బుధ, గురువారాల్లో 'న్యూస్‌టుడే' బృందం జిల్లాలో పరిశీలన జరిపింది.

– న్యూస్‌టుడే, బృందం

అధ్వానంగా పరుపులు



● ప్రభుత్వ బాలుర గిరిజన కళాశాల వసతిగృహం, జనగామ (ధర్మకంచ)

● ఇక్కడ 40 మంది విద్యార్థులు ఉన్నారు. పడుక పరుపులు అధ్వానంగా ఉన్నాయి. కిటికీలకు తలుపులు లేకపోవడంతో ప్లాస్టిక్ సంచులు అడ్డుపెట్టుకుంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతుంది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దుప్పట్లు ఇంటి నుంచే తెచ్చుకున్నారు. చల్లటి నీళ్లతోనే స్నానం చేస్తున్నారు. వెంటిలేటర్లకు, కిటికీలకు జాలీలు బిగించాలి.

	మొత్తం	విద్యార్థులు
బీసీ సంక్షేమ	16	1010
ఎస్టీ సంక్షేమ	10	600
ఎస్సీ సంక్షేమ	16	436

● జిల్లాలో వసతిగృహాలు ● మొత్తం ● విద్యార్థులు

ఆరుబయటే స్నానాలు..



● **వసతిగృహం పేరు:** బీసీ బాలుర వసతిగృహం, నర్మెట్ట

● **సమస్యలు:** బాత్‌రూంలలో కులాయిల సదుపాయం లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. వేడి నీళ్లు లేక చల్లటి నీళ్లతోనే స్నానమాచరిస్తున్నారు. దుప్పట్లు పంపిణీ చేసినవి నామమాత్రం ఉండటంతో ఇంటి నుంచి తెచ్చుకున్నవి వినియోగిస్తున్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

పడక మంచాలు కరవు



● బీసీ బాలుర వసతి గృహం, జనగామ (అంబేద్కర్ నగర్)

● పడక మంచాలు లేక విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. చాలామంది ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లను వినియోగిస్తున్నారు. స్నానానికి వేడి నీటి సదుపాయం లేదు. కిటికీలకు తలుపులు, మెష్ ఏర్పాటు లేకపోవడంతో చలితో పాటు దోమలతో నిద్రలేకుండా గడుపుతున్నారు. కిటికీలకు మరమ్మతులు, మెష్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

దాతలూ.. ముందుకురండి!

చలికాలం సమీపిస్తోంది. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు తలుపులు లేక, దోమలు రాకుండా జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజా ప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

● బీసీ వసతిగృహం, జఫర్‌గఢ్

● ఇందులో 59 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి గదిలో ఫ్యాన్లు, దోమలు, ఇతర విష కీటకాలు రాకుండా చర్యలు తీసుకున్నారు. దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం దృష్ట్యా స్నానాలకు హీటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయినా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు.

ప్రభుత్వం నుంచి అందిన దుప్పట్లు, కార్పెట్లు విద్యార్థులకు అందించాం.. పడక మంచాలు, తలుపులు, కిటికీల మరమ్మతు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని బీసీ సంక్షేమాధికారి రవీందర్, గిరిజన సంక్షేమాధికారి ప్రేమకళ, ఎస్సీ సంక్షేమాధికారి విక్రమ్‌లు తెలిపారు.

విరిగిన కిటికీలు.. చిరిగిన జాలీలు



● గిరిజన బాలుర వసతి గృహం, తరిగొప్పుల

● కిటికీల తలుపులు విరిగిపోయాయి. దోమల నివారణకు ఏర్పాటు చేసిన జాలీలు సైతం చిరిగిపోయాయి. దోమల బెడదతో విద్యార్థులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. దుప్పట్లు చలిని తట్టుకునే విధంగా లేవు. స్నానానికి వేడి నీటి సదుపాయం లేదు. కనీస మౌలిక వసతులు కల్పించాలి.


తలుపులు లేవు



● ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం, స్టేషన్‌ఘన్‌పూర్

● ఇక్కడ సుమారు 50 మంది విద్యార్థులు ఉన్నారు. పలు గదులకు తలుపులు, కిటికీలు లేవు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి, అధ్వానంగా తయారయ్యాయి. ఇన్‌ఛార్జి వార్డెన్ సమయ పాలన తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు సందర్శించి, సమస్యలు పరిష్కారంలో జాప్యం అవుతోంది.

వెంటిలేటర్లకు గ్లాసులు బిగించాలి



● బీసీ సంక్షేమ బాలుర వసతిగృహం, పాలకుర్తి

● ఇందులో 90 మంది విద్యార్థులు ఉన్నారు. చన్నీటి స్నానమే శరణ్యమైంది. శౌచాలయాల నిర్వహణ అరకొరగా ఉంది. నూతన విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. వెంటిలేటర్లకు గ్లాసులు బిగించకపోవడంతో రాత్రిళ్లు చలి ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.

వాటర్ హీటర్ ఏర్పాటు అవసరం



ఎస్సీ హాస్టల్‌లో మరమ్మతుకు సోలార్ హీటర్

● బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు, కొడకండ్ల

● చలికాలం సమీపిస్తుండటంతో విద్యార్థులు చన్నీటి స్నానమాచరిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఐదేళ్ల క్రితం సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ మరమ్మతుకు గురై మూలకుపడింది. అలాగే బీసీ, ఎస్టీ వసతి గృహాల విద్యార్థులు చలిలో చన్నీళ్లతోనే స్నానమాచరిస్తున్నారు. బెడ్‌షీట్లు అందినప్పటికీ ప్రత్యేక రగ్గులు సరఫరా కాలేదు. ఎస్టీ వసతి గృహంలో రెండు గదుల కిటికీలకు తలుపులు లేక అట్టలు అడ్డంగా పెడుతున్నారు. పక్షం రోజుల్లో ఏర్పాటు చేయించనున్నట్లు వార్డెన్ మల్లు తెలిపారు.



ఎస్టీ వసతి గృహంలో విరిగిన తలుపులు

నిబంధనలకు విరుద్ధంగా భూమి కొనుగోలు!

సెర్ప్ విభాగంలో ఓ అధికారిణి తీరు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడాల్సిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలోని సెర్ప్ విభాగంలో ఓ ఉన్నతాధికారిణి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కనీస నిబంధనలు పాటించకుండా జిల్లా, మండల సమాఖ్య ప్రతినిధుల తీర్మానాలు, ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే.. 'చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య' పేరిట ఆమె అక్రమంగా ఎందుకూ పనికిరాని భూములను అధిక ధరకు కొనుగోలు చేశారు.

ఈ విషయమై 'న్యూస్‌టుడే' డీఆర్డీవో వసంతను వివరణ కోరగా.. తాను ఇటీవలే విధుల్లో చేరానని, పూర్వాపరాలను పరిశీలించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు.



అంతా ఆమె ఏకఛత్రాధిపత్యంతోనే..

సెర్ప్ విభాగంలో కొన్నేళ్ల పాటు విధులు నిర్వర్తిస్తున్న ఒక ఉన్నతాధికారిణి ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇందులో కమీషన్‌లో 10 శాతం వాటా ప్రకారం కొన్నేళ్ల నుంచి దాదాపు రూ.3 కోట్ల పైచిలుకు నిల్వ ఉన్నట్లు సమాచారం. సాధారణంగా ఈ నిధుల నుంచి ఖర్చు చేయాలి అంటే డీఆర్డీవో, కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకు సాగాలి. గత రెండు నెలల కాలంలో అధికారుల బదిలీలను ఆసరాగా చేసుకొని జనగామ మండలంలోని జనగామ-వెల్దండ రహదారి వెంకిర్యాల వద్ద రాళ్లు, రప్పలతో కూడిన.. వ్యవసాయానికి నిరుపయోగమైన, హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ఉన్న నాలుగు ఎకరాల భూమిని ఎకరాకు రూ.58.75 లక్షల చొప్పున మొత్తం రూ.2.35 కోట్లతో అధికంగా వెచ్చించి కొనుగోలుచేశారనే ఆరోపణలున్నాయి.



అక్రమ భూ కొనుగోళ్లపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్వయం సహాయక సంఘం మహిళలు

నిబంధనలకు విరుద్ధంగా..

మహిళా స్వయం సహాయక సంఘాలకు పొదుపు, మార్కెటింగ్ ద్వారా వచ్చిన డబ్బులతో భూములను, ఇతర ఆస్తులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇది మండల సమాఖ్య ప్రతినిధుల తీర్మానాలు, డీఆర్డీవో సిఫారసు, జిల్లా కలెక్టర్ అనుమతులతో జరగాలి. ఏయే రంగాలకు వినియోగించేందుకు క్రయవిక్రయాలు చేశారు?.. వ్యవసాయ, నిర్మాణ రంగాల అధికారుల సలహాలు, సూచనలు, అనుమతులు లేకుండానే జరపడం పట్ల ఆ విభాగం సిబ్బంది, అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఎకరానికి.. రెండు పంటలకు సాగునీరు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో గురువారం ఈఎన్‌సీ నాగేందర్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ జలాశయం నుంచి నవాబుపేట జలాశయం వరకు ఉన్న ప్రధాన కాల్వ, డీబీఎం కాల్వల్లో పేరుకుపోయిన పూడికలను వెంటనే తొలగించాలి. ఇదే కాల్వలో పడిన గండిని పూడ్చివేయాలని అధికారులను కోరారు. అశ్వారావుపల్లి కుడి ప్రధాన కాల్వ, డీబీఎం పూడికలను తీయడంతో పాటు అవసరమైన భూ సేకరణ సమస్యలను పరిష్కరించాలని సూచనలు చేశారు. ఈ జలాశయం కింద ఉన్న ఆయకట్టుకు నీరు అందించడానికి ఓటీలు, తూముల మరమ్మతు చేపట్టాలి. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్ వద్ద బంజారామాటు నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలకు మంజూరు ఇప్పించాలని అధికారులను కోరారు. జఫర్‌గఢ్ మండలం తిడుగులోని 'ధంసా' చెరువు వరద కాల్వ మరమ్మతు చేపట్టాలని, అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మకూర్ ఎడమ ప్రధాన కాల్వపై ఖిలాషాపూర్ దగ్గర ఓటీ నిర్మాణం చేపడితే ఆపైన ఉన్న గ్రామాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. ఈఎన్‌సీ నాగేందర్‌రావు స్పందిస్తూ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేసి పరిపాలన అనుమతులు పొందాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నీటిపారుదల శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే పల్లా

జనగామ టౌన్, న్యూస్‌టుడే: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారాస పూర్వ వైభవం కోసం కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలే ఎజెండాగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించనుందని వివరించారు. కలిసిన వారిలో భారాస నేత రాకేష్‌రెడ్డి తదితరులున్నారు.



కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పల్లా, చిత్రంలో రాకేష్‌రెడ్డి

గీత కార్మికులకు అండగా 'కాటమయ్య కిట్టు'

పాలకుర్తి, న్యూస్‌టుడే: అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేసి, మాట్లాడారు. ఈ కిట్లు ప్రమాదాల నివారణకు దోహదపడుతాయని వివరించారు. జిల్లాలోని 600 మంది గీతకార్మికులకు కిట్లు అందజేశామని, దశలవారీగా మిగతా వారికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, సీఐ సంతోష్‌రెడ్డి, ఎస్సై పద్మ, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, కుమారస్వామి, వెంకటేశ్వర్లుగౌడ్, మొగులూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!
కాకతీయకు కైటెక్స్ కళ!
వివరాలు 8లో..

ఆమె ధైర్యం.. షీ టీం!

పదేళ్లకు ముందు: ఆకతాయిల ఆగడాలు, వారి వికృత చేష్టలు.. ఆ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అతివలది..

ప్రస్తుతం: ధైర్యంగా షీ టీంలకు చెబుతున్నారు. బృందాల్లోని సభ్యులు మఫ్టీల్లో తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. కేసులు పెట్టి కటకటాల్లోకి నెడుతూ మహిళలకు భరోసా ఇస్తున్నారు.

SHE TEAMS
TELANGANA POLICE
Safety for Her Ensured

మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం 2014 అక్టోబరు 24న అందుబాటులోకి తీసుకొచ్చిన షీటీం వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది.. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఈ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అతివలకు భరోసా కల్పిస్తున్నాయి. విద్యాసంస్థలు, ప్రజలు ఎక్కువగా గుమ్మిగూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

మీకు తెలుసా..

● ఈవ్‌టీజింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడితే నిర్భయ చట్టం కింద కేసులను నమోదు చేస్తారు.

● షీటీంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా కానిస్టేబుళ్లు ఉంటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ ఏసీపీ, మహబూబాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఈ బృందాలు పని చేస్తున్నాయి.

పదేళ్లు పూర్తి చేసుకున్న వ్యవస్థ





గోడపత్రికల ద్వారా ప్రచారం చేస్తున్న షీ బృందం సభ్యులు

నిఘా పెట్టి.. కౌన్సెలింగ్ ఇచ్చి

● ఆరు నెలల కిందట హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తుండడంతో ఓ మహిళ.. షీటీంకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన బృందం నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చింది.

● మూడు నెలల కిందట వరంగల్ పోచమ్మ మైదానం ప్రాంతంలో బస్సులు నిలిపే స్థలంలో కొంతమంది యువకులు మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నట్లు సమాచారం రావడంతో షీ బృందం మఫ్టీలో ఉండి వారిని పట్టుకుంది.

● మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో ఓ మహిళను స్థానికంగా ఉండే యువకులు వేధిస్తుంటే షీ బృందానికి ఫిర్యాదు వెళ్లింది. వారిని కేసు నమోదు చేయించారు.

● హనుమకొండలో దుకాణంలో ఉన్న మహిళను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

క్యూఆర్ కోడ్‌తో..



ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా ఫిర్యాదు చేసేందుకు షీ టీంలు 2022లో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చాయి. కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సినిమా థియేటర్లు, ఆర్టీసీ బస్సుల్లో.. ఇలా జనాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్లను అతికించారు. బాధితులు తమ ఫోన్ ద్వారా దానిని స్కాన్ చేయగానే డీజీ ఆఫీసుకు ఫిర్యాదు వెళ్తుంది. వెంటనే దరఖాస్తు ఫారం వస్తుంది. వివరాలు నమోదు చేసి సెండ్ చేసిన వెంటనే జిల్లా షీటీంకు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. బృందం అక్కడికి చేరుకుని ఆకతాయిల ఆటకట్టిస్తారు.

● qr.tspolice.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయ్యి ఫిర్యాదు చేస్తే సరిపోతుంది.

కేసులు నమోదు ఇలా

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో

సంవత్సరం	కేసులు
2022	425
2023	525
2024	342

మహబూబాబాద్ పోలీస్‌శాఖ..

సంవత్సరం	కేసులు
2022	09
2023	47
2024	30

● 2022 ● 2023 ● 2024

ఫిర్యాదుల సంఖ్య పెరిగింది

- సుజాత, షీ టీం విభాగం ఇన్‌స్పెక్టర్

గతంలో కంటే ప్రస్తుతం ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. మహిళలకు ఉన్న చట్టాలు, రక్షణ గురించి కళాశాలలు, పాఠశాలలో షీ బృందం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. వారికి రక్షణగా ఉంటుంది. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందిస్తారు.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

డయిల్ 100, 112

వరంగల్ కమిషనరేట్ షీ టీం నెంబరు: 87126-85124

మహబూబాబాద్ షీ టీం నెంబరు, వాట్సాప్: 8712656935, 7901142009

● ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

షీ టీంలు ఉమ్మడి జిల్లాలోని పాఠశాల, కళాశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై, పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. గుడ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటి.. ఏవిధంగా వేధిస్తారో ప్రాక్టికల్‌గా చూపిస్తూ. . ఆ సమయంలో రక్షణ కోసం ఎలా స్పందించాలో బాలికలకు వివరిస్తున్నారు.



మహబూబాబాద్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం..

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని.. ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఏస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో రుసుం చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. –రంగశాయిపేట, న్యూస్‌టుడే



వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. నగదు రహిత ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికీ కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్జాల సేవలు మెరుగుపరచాలి.

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీసేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ముందస్తు స్లాట్ విధానం సైతం అంతర్జాలంలోనే అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లతో చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేస్తే స్కానర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీల రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీల కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్లాక ఖాతాదారుడికే డీడీలు ఇస్తామని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.

ఆందోళన



చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్ల కొత్త నిబంధనలతో దళారులకు పంట పండుతుంది.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసులు నమోదు చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుంలన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతె చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం.. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపెల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పరిశ్రమకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థలో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసి ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్‌లను స్థాపించాయి. గణేషా ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేషా ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, బీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ.1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమరుస్తున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించగా ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక



భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

SCHOOL INNOVATION MARATHON

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి. స్వామి తెలిపారు.

జనవరిలో విజేతల ప్రకటన: నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!



వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద



ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..



మహిళల మెడికల్ వార్డు వైపు..



ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..

173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4.48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి. రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె. వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తరువులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా. సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ. 3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. కాళీప్రసాదరావు, ఏపీఏ అధ్యక్షుడు డా. సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా. శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

పాఠశాలల వంటపాత్రలకు నిధులు మంజూరు

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైనప్పుడు అందించిన వంటపాత్రలు మినహా ఇప్పటి వరకు మళ్లీ వాటిపై దృష్టి సారించలేదు. కాలం చెల్లిన పాత్రలతో వంటలు రుచికరంగా ఉండకపోవడంతో పాటు ఇబ్బందులు పడుతున్నామని వంట ఏజెన్సీ మహిళలు ప్రభుత్వ గమనానికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. కొత్తగా ప్రభుత్వం వంటపాత్రల కొనుగోళ్లకు నిధులు మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాల వివరాలు..

జిల్లా	నిధులు మంజూరు (రూ.లలో)
జనగామ	44,15,000
మహబూబాబాదు	70,95,000
భూపాలపల్లి	32,40,000
ములుగు	33,95,000
హనుమకొండ	50,65,000
వరంగల్	52,30,000

పాత్రలు ఇవి..

తెల్ల అన్నం వండే గిన్నెలు(బగోనా అనికూడా పిలుస్తారు), ఇంగ్రిడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కఫ్గిర్(స్థానికంగా హస్తం అంటారు), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితరాలను ప్రతి బడికి అందిస్తారు.

☛ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాత్రలను అందించేందుకు జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లోనే సరఫరాకు బహిరంగ టెండర్లు పిలువనున్నారు. జిల్లా స్థాయిలో వంటపాత్రల సరఫరాకు అన్ని రకాల అర్హతలున్న పంపిణీదారుల నుంచి టెండర్లు ఆహ్వానించి పాత్రల కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తారు.



కాలం చెల్లిన పాత్రలతో వంట వండుతున్న మహిళలు

తాగునీటికి కటకట



మండలంలోని కుర్చపల్లిలో తాగునీరు సరిపడా సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మిషన్ భగీరథ ట్యాంకుతో పాటు స్థానిక బావి నుంచి నీటిని పంపిణీ చేసేవారు. ప్రస్తుతం బావి నుంచి నీటి పంపిణీ నిలిచిపోయింది. మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజులకోసారి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక అధికారులు దృష్టిసారించి బావి నీటిని తాత్కాలికంగా పునరుద్ధరించి, శాశ్వతంగా మరో ట్యాంకును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, రఘునాథపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా
జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గడ్: 98662 50618
(10 AM TO 1 PM)

జనగామ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులు అనేక చోట్ల గుంతలమయమయ్యాయి. స్థానిక సుభాష్‌చంద్రబోస్ విగ్రహం నుంచి గాంధీ కూడలి వరకు గుంతలు పూడ్చాలి.

- మహంకాళి, పోచమ్మ గుడి ప్రాంత వాసులు

● పోలీస్‌స్టేషన్ పక్కన రజకవాడ మీదుగా బొడ్రాయి వెళ్లే మార్గంలో రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. మరమ్మతు చేయాలి. **- 25వార్డు ప్రజలు**

● స్థానిక లక్ష్మి కృష్ణ పాత థియేటర్ మూల మలుపులో, పోలీస్‌స్టేషన్ గణేశ్‌వాడ, బొడ్రాయి మార్గంలో, 27వార్డు పరిధిలో ధర్మశాల వీధిలో, కూరగాయల మార్కెట్ నుంచి రెడ్డి వీధి మీదుగా వాసవి కాలనీకి వెళ్లే దారిలో గుంతలను పూడ్చాలి. **- స్థానికులు**

సమాధానం: వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. రహదారుల గుంతలను పూడ్చడానికి ప్రాధాన్యం ఉంది. పరిశీలించి గుంతలు పూడుస్తాము. **- మహిపాల్, మున్సిపల్ ఇంజినీర్**

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కువగా సి-సెక్షన్(సిజేరియన్) ప్రసవాలు జరుగుతున్నాయని, ఆసుపత్రుల యాజమాన్యాలు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సాధారణ ప్రసవాలు, రిజిస్ట్రేషన్ స్కానింగ్, తదితర అంశాలపై జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్షలో పాల్గొని, మాట్లాడారు. సి-సెక్షన్ ఆపరేషన్లు ఎన్ని అవుతున్నాయనే వివరాలను వైద్య ఆరోగ్య శాఖ పోర్టల్ ప్రకారం ప్రతి నెల 5వ తేదీలోగా వివరాలను ఇవ్వాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించని వారిపై క్లినికల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. రవీందర్‌గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్, వ్యాక్సినేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్

బడుల అభివృద్ధి పనులను పూర్తి చేయండి..

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులపై ఎంపీడీవో, ఎంఈవో, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పూర్తయిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను సంబంధిత ఏజెన్సీలు నవంబరు 10లోగా పంపించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో మాధురిషా, డీఈవో రాము, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో అలసత్వం వద్దు

చిల్పూర్, న్యూస్‌టుడే : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు మర్యాదగా వ్యవహరించి.. కేసులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని డీసీపీ బి.రాజమహేంద్రనాయక్ అన్నారు. స్థానిక ఠాణాను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది కిట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించవద్దని సూచించారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



స్టేషన్‌లో కిట్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు..

జనగామ టౌన్: జనగామ జిల్లా కేంద్రంతో పాటు అన్ని ప్రాంతాల్లోని బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పలు బ్యాంకులకు చెందిన మేనేజర్లు, పలు స్థాయిల అధికారులకు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచించారు. జనగామ ఏసీపీ కార్యాలయ ఆవరణలో గురువారం బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. బ్యాంకు లోపల, బయట ఆత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల బ్యాంకుల ఎదుట ఖాతాదారుల నుంచి నగదు కాజేసే చోరీ ఘటనలు వెలుగుచూశాయన్నారు. ఈ క్రమంలో బ్యాంకు అధికారులు అప్రమత్తత చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జనగామ ఏసీపీ పార్థసారధి, పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

జనగామ, న్యూస్‌టుడే: స్థానిక గణేశ్‌వాడ, మార్కెట్ ఏరియాలో కాల్వ పనుల కోసం పోసిన నిర్మాణ వ్యర్థాలు, ఇతర సామగ్రిని తరలించకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఉందని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను 'న్యూస్‌టుడే' ఎంఈ మహిపాల్‌కు వివరించగా, ఆయన ఆదేశాలతో గుత్తేదారు వాటిని తరలించారు.

అల్లుకున్న తీగలు..

స్టేషన్‌ఘన్‌పూర్: కొత్తపల్లి శివారు వరంగల్ రహదారిలో విద్యుత్ స్తంభానికి తీగజాతి మొక్కలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. సమస్యపై 'ఈనాడు'లో గురువారం ప్రచురించిన చిత్రవార్తకు ఏఈ శంకర్ స్పందించారు. వెంటనే సిబ్బందితో అల్లుకున్న తీగలను తొలగించారు.



రహదారి శుభ్రం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని సంతోష్ అనే వ్యక్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరచారి వెంటనే స్పందించి, సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పడాల విష్ణుమూర్తి, ప్రత్యేకాధికారిణి అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: పదో తరగతిలో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షల తీరు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రతి రోజు పదో తరగతి విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇర్రి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు భారతిదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టైక్వాండో పోటీలకు బానోతు రుద్ర



జనగామ, న్యూస్‌టుడే: అఖిల భారత విశ్వవిద్యాలయ స్థాయి టైక్వాండో పోటీలకు జనగామ విద్యార్థిని బానోతు రుద్ర ఎంపికైంది. కాకతీయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన ఎంపిక పోటీల్లో స్థానిక ఏకశిల డిగ్రీ కళాశాల విద్యార్థిని టైక్వాండో ఫైటర్ రుద్ర 62 కిలోల లోపు విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నవంబరు 12 నుంచి 15 వరకు పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరిగే పోటీలకు ఎంపికైందని కోచ్ అబ్బాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు ప్రిన్సిపల్ మల్లికార్జున్, నాగరాజు, సహ విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

హామీలను అమలు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో గురువారం పార్టీ గ్రామ మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్బాస్ మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులు అందించి, రైతు భరోసా నగదును ఖాతాలో జమ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.కనకరెడ్డి, నేతలు రాజు, రమేష్, కొండల్‌రెడ్డి, సోమయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్బాస్

చిల్పూర్ : మండల కేంద్రంలో నవంబర్ 4న నిర్వహించే సీపీఎం మండల 3వ మహాసభను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. గురువారం మండల కమిటీ అధ్వర్యంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు పరమేష్, సంపత్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలపై కళాజాత

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ జాగృతి పోలీస్ కళాబృందం ఆర్టీసీ చౌరస్తాలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అమరవీరుల త్యాగాలను పాటలు, నాటక రూపంలో కళాకారులు ప్రదర్శించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జనగామ ఏసీపీ పార్థసారధి, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో నాయకులు ఇరుగు ప్రకాశ్, కిషన్, అరుణ్, బాబు, రణధీర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేడియాలజీ హబ్ కరెంటు సరఫరాకు ఆటంకం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న రేడియాలజీ హబ్‌కు కరెంట్ సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు గురువారం తెగిపోయాయి. పక్కనే మహిళా శక్తి క్యాంటీన్ నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారు రేడియాలజీ హబ్‌కు వచ్చే అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్లను గమనించకుండానే జేసీబీ పనుల్లో భాగంగా తవ్వడంతో తెగాయి. దీంతో స్కానింగ్, ఇతరత్రా పరీక్షలు చేయడానికి శుక్రవారం ఇబ్బందిగా ఉంటుందని జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ మధుకర్ తెలిపారు. గుత్తేదారును తిరిగి వైర్లు సరిచేయాలని కోరినా కూడా తనకు సంబంధం లేదని చెప్పారన్నారు. వైద్యశాఖలో కీలకమైన సేవలందిస్తున్న రేడియాలజీ హబ్‌కు తెగిన కేబుల్ వైర్లను, మిగిలిన పనులను గుత్తేదారు చేయాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

పశువైద్య శిబిరం తనిఖీ

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గోవర్ధనగిరిలో పశువైద్య శిబిరాన్ని గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రాధాకిషన్, ఏడీ నర్సయ్య ఆకస్మికంగా సందర్శించారు. పశువులకు అందిస్తున్న చికిత్సలు, వైద్య శిబిరాల వివరాలు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాముకాటుతో వృద్ధురాలి మృతి

నర్మెట్ట, న్యూస్‌టుడే: పాముకాటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన గుండెల్లి కేతవ్వ(60) తన భర్త కొమురెల్లితో కలిసి తమ వ్యవసాయ క్షేత్రంలో పత్తి తీయడానికి వెళ్లారు. ఈ క్రమంలో కేతవ్వను పాము కాటు వేయగా, గమనించిన భర్త స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వాహనం వచ్చే సరికే కేతవ్వ మృతి చెందినట్లు తెలిపారు.



కేతవ్వ (పాత చిత్రం)

అక్రమ కొనుగోళ్లపై సమావేశం బహిష్కరణ

నర్మెట్ట, న్యూస్‌టుడే: మండల సమాఖ్యలకు ఎలాంటి సమాచారం అందించకుండా జిల్లా సమాఖ్య వారు భూమిని కొనుగోలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. మండల తీర్మాణం చేయకుండా భూమి కొనుగోలు ఎలా చేశారని సభ్యులు సంఘం అధ్యక్షురాలు సుప్రియను నిలదీయడంతో తనకు కూడా ఎలాంటి సమాచారం లేదని, రూ.2.80 కోట్లతో 4 ఎకరాల భూమిని సెర్ప్ అధికారి ఒకరు అధికంగా వెచ్చించి కొనుగోలు చేశారని తెలిసిందని సుప్రియ తెలిపారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేయాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా ఐదుగురు సభ్యులతో నియమింపబడిన కమిటీ ద్వారానే అర్హులైన పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు ములకల లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్లు లేని నిరుపేదలందరికీ నిర్మించి ఇస్తామన్న హామీ మేరకు పేదలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్, చెల్లోజు మల్లేశం, లింగాల రాములు, శ్రీహరి, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్.రాజారెడ్డి

కొనుగోలు కేంద్రం ప్రారంభం

జనగామ రూరల్, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి ధాన్యాన్ని పండించిన రైతులకు మద్దతు ధర కల్పించేందుకు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. మండలంలోని శామీర్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఇందిర, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, మహేందర్, పీఏసీఎస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళ అదృశ్యంపై కేసు నమోదు

చిల్పూర్, న్యూస్‌టుడే : మండలంలోని లింగంపల్లి శివారు యాపాలబోడుతండాకు చెందిన బాదావత్ సుమలత(35) అదృశ్యమైనట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఇంట్లో భర్త లింగంతో గొడవ జరగ్గా.. ఇంట్లో నుంచి సుమలత వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బందారం లక్ష్మయ్య ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కడుదూరి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుంటిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా యాదగిరి, వెంకటలక్ష్మి, భాస్కర్, నర్సింహ్మారెడ్డి, తదితర కార్యవర్గాన్ని నియమించారు. ఎన్నికైన సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలని వినతి

జనగామ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి ముస్లిం మైనార్టీలు అండగా నిలిచారని, ఇటీవలి శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజాపాలన కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి తెలిపినట్లు కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమాల్‌షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం గత 30 ఏళ్లుగా కృషి చేశానని, నామినేటెడ్ పోస్టుల భర్తీ సందర్భంగా తన సేవలను గుర్తించాలని కోరామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించామన్నారు.

సదస్సుకు తరలిన నాయకులు



జనగామ టౌన్, న్యూస్‌టుడే: వరంగల్ కేయూలో గురువారం నిర్వహించిన మాదిగ విద్యార్థుల రాష్ట్ర స్థాయి సదస్సుకు జనగామ నుంచి ఎంఎస్ఎఫ్ విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగాలను భర్తీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య సదస్సు సద్వినియోగం చేసుకోవాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు పలు సంస్థలు నిర్వహిస్తున్న నైపుణ్య సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక క్రీస్తు జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి సూచించారు. కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం నైపుణ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, వక్త సీహెచ్.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చరణ్



నర్మెట్ట, న్యూస్‌టుడే: మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం మండల కేంద్రంలో నిర్వహించగా ఆ కార్యక్రమానికి ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు జిజి.కిషోర్ మాదిగ హాజరయ్యారు. సమావేశంలో వెల్దండ గ్రామానికి చెందిన కంతి చరణ్‌కుమార్ మాదిగను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రకటించి నియామకపత్రాన్ని అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు చరణ్ ధన్యవాదాలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పుస్తకాల అందజేత

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే : మండలంలోని హిమ్మత్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులను క్రాంతి ఫౌండేషన్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జయప్రకాశ్ మాట్లాడుతూ.. పిల్లలు ఆంగ్లభాషలో కఠినమైన పదాలకు అర్థాలు తెలుసుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాగి ఎల్లారెడ్డి, సాంబరాజు, హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి.రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జనగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్థానిక వీవర్స్ కాలనీలో ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. లేబర్‌కార్డు ఉన్న కార్మికులకు రూ.10వేల విలువైన పలు వైద్య పరీక్షలను గురువారం నిర్వహించినట్లు శిబిరం సమన్వయ కర్త ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు నిర్వాహక విభాగం డివిజన్ మేనేజర్ ఆర్.సుమన్, చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు గుర్రం నాగరాజు, బి.నాగేంద్రబాబు, శ్రీరామ్‌శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, మంగళంపల్లి రాజు పాల్గొన్నారు.

లాభసాటి లేని చోట క్యాంటీనా?..

జనగామ, న్యూస్‌టుడే: ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు పథకంలో భాగంగా జనగామ పట్టణ మహిళలకు ఒక కేంద్రాన్ని మంజూరు చేశారు. బస్టాండు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు విఫల ప్రయత్నం జరిగింది. చివరకు ఇందిరాక్రాంతి పథం భవనం పక్కన స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ సగం రేడియాలజీ ల్యాబ్‌ను నిర్మించారు. అసలు ఇక్కడ క్యాంటీన్ లాభసాటి అవుతుందా? నిర్వహణ వ్యయం అయినా మిగులుతుందా? అనే విశ్లేషణలు లేవని స్పష్టమవుతోంది. మున్సిపల్ ప్రధాన ఆవరణలో ఎస్‌బీఐ, ఆ పక్కన ఏటీఎం, సహాయ కేంద్రం, ఈ సముదాయం పక్కనే మున్సిపల్ ప్రధాన కార్యాలయం ఉంది.. ఖాతాదారులు, సందర్శకుల రద్దీ ఉంటుంది. ప్రధాన ప్రవేశ ద్వారం గేటు పక్కనే విశాలమైన స్థలం ఉంది. ఇక్కడ ఏర్పాటు చేస్తే లాభసాటి ఉంది. మున్సిపల్ ఆవరణతో పాటు, బయట రహదారి, రెండు వైపులా క్యాంటీన్ సేవలను అందుకోవచ్చు. ఇక్కడైతే మున్సిపల్, బ్యాంకు, జిల్లా ఆసుపత్రి సందర్శకుల గిరాకీ ఉంటుంది.



మహిళా శక్తి క్యాంటీన్ ప్రతిపాదిత స్థలం..



ఠాణా గేట్లు మూసివేత

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుస్టేషన్ గేట్లను పోలీసులు మూసి ఉంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం పాలకుర్తిలో ఒకరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని మృతి చెందాడు. ఈ ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇలా స్టేషన్ గేట్లను మూసివేస్తున్నారు. మనుషులు వెళ్లేందుకు చిన్న గేట్‌ను తెరచి ఉంచుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంకు చెందిన భారాస నేత ఇల్లందుల రాజు తండ్రి అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇల్లందుల బాబు తల్లి బొందమ్మ ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అయన వెంట భారాస నియోజకవర్గ కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, బీసీ, ఎస్సీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు కుమార్, బుచ్చయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.